# రెక్కలగూడు

ఆకాశమే విరిగి పడుతున్నదా అన్నట్లుగా ఇంజను ఫెళఫెళమన్నది. పక్కనే కూర్చొని తలుపేస్తున్న సాంబిగాడు ఒక్క దూకు దూకాడు.

"గురో! దీనికి మళ్ళేదో రోగమొచ్చినట్లున్నాది!"

తంగవేలు బ్రేకును ఒక్క తొక్కు తొక్కాడు. "దీనెమ్మ..." పంచాంగం విప్పేశాడు. పేరుకు తంగవేలేగాని తెలుగు మాటలేగాదు తెలుగు బూతులన్నీ వచ్చు. అతడు అరవంలో 'అఆ'లు నేర్చుకున్నాడో లేదో చెప్పటానికి తల్లిగాని, తండ్రిగాని లేరు. అతడు 'గుంటూరులోనే లాగేసుకోవటం నేర్చుకున్నాడు' అని గర్వంగా చెబుతుంటాడు.

కుడివైపున కాలువగట్టు మీదున్న గుడిశెల మధ్య నుంచి కంపు ముక్కుపుటాలను అదరగొట్టేస్తోంది. చొక్కాల్లేని ఇద్దరు కుర్రాళ్ళు తడి లాగులతో లారీలోని తంగవేలు వంకే చూస్తున్నారు.

"ఇంకేట్రా?"

"ఏం లేదు!" అంటూ కదలకుండా అక్కడే నిల్చున్నారు. "సినిమాకు వెళ్ళాలి సారూ!"

తంగవేలు ఫక్కున నవ్వాడు. "బడ్డు సన్నాసుల్లారా! ఊఁ... పట్టండి... ఈ అయిదూ తీసుకెళ్ళి ఏడ్వండి!"

"థాంక్స్‌ప్చే!" అయిదూ పట్టుకొని పరుగెత్తారు– జారిపోతున్న లాగుల్ని పైకి లాక్కుంటూ.

లారీలను కడగటం వాళ్ళ వృత్తి. వాళ్ళకు తెలుసు తంగవేలు పచ్చడొక్కు లారీ వచ్చిందంటే మిగతావాటి మీద ఓ అయిదు ఎక్కువే గిడతయ్యని!

సంతోషంగా వెళ్తున్న వాళ్ళనే కళ్ళు పెద్దవిచేసుకు చూస్తూ రెండు నిముషాలు అలాగే వుండిపోయాడు తంగవేలు.

మధ్యాహ్నం మూడు గంటలయింది. బెజవాడ ఎండ మండిపోతోంది. లారీ ఇంజను చావబోయే మనిషి గురక పెట్టినట్లుగా గురగురమంటోంది.

"ఏం చేద్దాంరా సాంబిగా?"

"షెడ్డులోకి తోసేద్దాం గురూ!"

"మరి గుంటూరుకి గోనె సంచులు వెళ్ళాలిగదరా!"

"ఇప్పుడు మూడే గదా అయింది గురూ!"

"ఆ బండగాడు వెంటనే బాగుచేస్తాడా దీని రోగం!"

"చూద్దాం గురూ... అక్కడ బండి వదిలేసి... చాలా రోజులయింది గురూ... ఒక్కసారి..."

"ఆఁ... ఒక్కసారి?" విసుగ్గా మొహంపెట్టి చూచాడు తంగవేలు సాంబిగాడి వంక.

"ఒక్కసారి... ఓ చుక్కేసుకొని– ఆరునెల్లయింది గురో... నాలిక పీకుతోంది!"

"ఏరా లమ్డీకొడకా... లారీని ఏ గోతిలోకి దింపాలనిరా... నేను చుక్కేసుకుంటే బండెక్కనని తెలుసు గదా... సేటు ఏం చెప్పాడు... ఎట్లాగైనా ఈ రాత్రికి గోనె సంచుల్ని తెచ్చి గోడౌన్‌లో పడేయమన్నాడా లేదా?"

"చెప్పాడనుకో గురూ!"

"మరి..."

"నాలిక మొద్దుబారి పోయింది గురో!"

"సరే ఏడు... ఈ పదీ తీసుకు వెళ్ళి నువ్వు తాగిరా... ఇంద! లారీ సంగతి నేను చూస్తానులే!"

"వద్దులే గురూ... నువ్వు లేకుండా నేను వెళ్ళను!" మొహమాటంగ తల అటూయిటూ తిప్పాడు సాంబిగాడు.

"నీ బొంద... చెప్పినట్లు ఏడ్చిచావు... తీసుకో... వచ్చేటప్పుడు రెడ్డి దగ్గర నా కిళ్ళీలు నాలుగు కట్టించుకురా!" డబ్బులు తీసుకొని తలవంచుకు పోతున్న సాంబిగాడ్ని మళ్ళీ వెనక్కు పిలిచాడు. "ఈ పదీ తీసుకువెళ్ళి... ఎన్నొస్తే అన్ని చాకెట్లు పట్టుకురా!"

సాంబిగాడు వెళ్ళిపోయాడు.

దడదడలాడుతున్న లారీని అక్కడికి కిలోమీటరు దూరంలో వున్న బండగాడి షెడ్డులోకి తిన్నగా లాగించాడు తంగవేలు.

బండగాడు గేటు దగ్గర నిల్చొని చుట్టత్రాగుతున్నాడు. "ఏం తంగవేలు మామా... నాలుగు రోజులయింది... నీ డొక్కులారీ ఇంకారాలేదేమా అనిచూస్తున్నా...సేటుకుచెప్పి ఏ కీలుకి ఆ కీలు విరిచి తూకానికి వేయమని చెప్పరాదూ!"

తంగవేలు నవ్వాడు. "ఎంత డొక్కుదయినా తండ్రి ఇచ్చింది... మా సేటుకు దాన్నిచూస్తుంటే చచ్చిన వాళ్ళ నాయన్ను చూస్తున్నట్లుగా వుంటుంది!"

"ఇంతకీ ఏమైంది?" చుట్ట పారేసి ఖాండ్రించి ఉమ్మేశాడు.

"అవునూ– ఇంత ఖాళీగా వున్నావ్... పన్లేం లేవా?"

"అఁ వున్నాయి ... చంటి గాడి కాలి మీద సుత్తి పడి చితికింది ... అంతా ఆ ఎదురుగ్గా వున్న ఆసుపత్రికి అఘోరించారు!"

"అరెరె... ఎట్టున్నాడు వాడు?"

"ఏం కాలేదులే... కాస్త రక్తం పోయింది!"

"అమాయకపు ముండాకొడుకు వాడు...నువ్వు దీని సంగతేదో చూడ్రాదు... నేనెళ్ళొకసారి వాడిని చూసొస్తాను!"

"ఏం అక్ఖర్లేదుగాని... అంతా అయిదు నిముషాలల్లో వస్తారు... నీ బండికి వచ్చిన రోగమేమిటో చెప్పు!"

"గురక మొదలయిందిరా!"

బండగాడు అంటే మొద్దులా వుండడు. బక్కగా ఇప్పుడే చచ్చేటందుకు సిద్ధంగా వున్నట్లుంటాడు... చుట్టల మీద చుట్టలు తాగుతుంటాడు.

"ఊఁ... నెట్టు లోపలకు... గొయ్యి తొవ్వించేస్తాను!"

"దేనికిరా?"

"పాతిపెట్టేద్దాం... గురక మొదలయిందంటే చావుకొచ్చిందన్నమాటే!"

తంగవేలు నవ్వేసి దడదడలాడుతున్న లారీని ముందుకు తీసుకు వచ్చి ఇంజను ఆపి దిగాడు.

బండగాడు బాయినెట్ ఎత్తి పైకెక్కాడు. డీజల్ పొగ ఘుప్పుమని ఉక్కిరిబిక్కిరి చేస్తూ ముక్కుల్లోకి జొరబడింది. ముఖం పక్కకు తిప్పుకొని ఉమ్మేశాడు. "ఛండాలపు బండి... ఛండాలపు బండి అని... తంగవేలుగాడు కాబట్టి దాన్ని నమ్ముకు తిరుగుతున్నాడు!" గొణుక్కోసాగాడు.

"నే వెళ్ళొస్తా!"

"నిన్ను ఆపటం కష్టంగాని... పోయి తొందరగారా... రోజూ చచ్చేదానికి పెద్ద రోగమేముండి చస్తుందిలే... అయిదు నిముషాలల్లో సరిచేస్తా!"

"అలాగే!"

తంగవేలు ఆసుపత్రికి వెళ్ళి చంటిగాడిని చూచాడు. వెళ్తూ వెళ్తూ ఓ బిస్కెట్ ప్యాకెట్ కొనుక్కు వెళ్ళాడు.

"ఏరా ముండావాడా... చూచుకు పనిచేయఖర్లేదురా!"

"చేయి జారింది మామా!" కాలికి ఓ అంగుళం మందాన కట్టు కట్టారు.

"ఈ బిస్కెట్లు తిని ఏడు!"

తంగవేలుకు తెలుసు- తల్లీ, చెల్లెలు ఆ కుర్రవాడిమీదే ఆధారపడి వున్నారని- వాడి జీతమొక్కటే వాళ్ళకు గతని. ఈ మందులకుగూడా ఎక్కడ పెట్టి చస్తాడు- బండగాడు ఒక్క నయాపైసా ఎక్కువ విదిలించడు- రాత్రిం బగళ్ళయితే పని చేయించుకుంటాడు గాని- అందుకే జేబులోనుంచి ఓ పాతిక తీసి వాడి చేతిలోపెట్టాడు. పక్కనున్న ఆ పిల్లవాడి తల్లి కళ్ళనీరు పెట్టుకుంటున్నది. ఆమెకు ఓదార్పుగా నాలుగు మాటలు చెప్పి బయటపడ్డాడు.

లారీ బాగయితే గుంటూరుకు గోనె సంచులు వీలయినంత త్వరగా జేరేయాలి. అసలే వానొచ్చేలా వున్నది. టార్పాలిన్ గూడా లేదు.

షెడ్డుకొచ్చిన పావుగంటకు గాని సాంబిగాడు రాలేదు. అప్పటికే జోడు గుర్రాల మీద ఊగిపోతున్నాడు.

"గురో! చాక్లెట్లు... పిల్లనాకొడుకులకు తెమ్మన్నావు గదా!"

పొట్లాన్ని అందుకున్నాడు తంగవేలు వాడిని అసహ్యంగా చూస్తూ.

"నోర్మూయ్యరా ముండా!"

బండగాడు లారీ బాయనెట్‌ను మూశాడు. "మళ్ళీ దీన్ని నా షెడ్‌లోకి తెచ్చారో మిమ్మల్ని దాన్ని గూడా కృష్ణలోకి తోసేస్తానురోయ్!" అంటూ విసుక్కున్నాడు.

తంగవేలు నవ్వాడు. "ప్రాణం పోయేటంత వరకూ డాక్టరు మందులు పోస్తూనేవుండాలి... నీ వద్దకు రావద్దంటే ఎలా?"

లారీ ఎక్కి ఊడిపోతున్న తలుపుకు గొళ్ళెం పెట్టాడు. బ్రేక్ మీద కాలుపెట్టి ఇంజన్ స్టార్టు చేశాడు. నీళ్ళల్లో మునుగుతున్నవాడు గుటకలేస్తున్నట్లుగా గుడగుడలాడింది. సాంబిగాడు పక్కనుంచి ఎక్కగానే, పదిరూపాయల నోటూ బండగాడి చేతిలో పెట్టి గేటు దాటించాడు లారీని.

"దానెమ్మశిగతరగ! మనమే కృష్ణలోకి తోసేద్దాం గురో!"

"ఇది పోయింతరువాత నీ పెళ్ళానికి తిండెట్లా పెడతావురా!"

"ఇంకో లారీ!"

"అయ్య! నీ అంత మొగాడు లేడనిపించి యిస్తారు... నోర్మూసుకోరా ముండా!"

లారీ మళ్ళా కృష్ణ వద్దకు వచ్చింది. పిల్లలంతా మూగారు. "తంగవేలు డొక్కులారీ మళ్ళా వచ్చిందోచ్!"

తంగవేలు లారీ ఆపాడు. సాంబిగాడు తెచ్చిన పొట్లమిప్పాడు. చాక్లెట్లు తీసి మూగిన పిల్లలందరికీ పంచిపెట్టాడు.

"ఇవ్వాళ స్పెషలేంటి మామా?"

"అరేయ్ సన్నాసులూ! పెట్టింది తినండ్రా... ఎందుకూ, ఏమిటీ అని ఆరాలేమిట్రా?" సాంబిగాడు కసురుకున్నాడు.

"సాంబిగా!" గుడ్లురిమాడు తంగవేలు.

"మామా మామా మరొకటి... మరోటి!" పిల్లలంతా మళ్ళీ మూగారు.

తంగవేలు సన్నని మీసాల క్రింద లావుపెదాలు పెద్దవయి విచ్చుకున్నాయి. "తినండ్రా తినండి!" అంటూ మళ్ళా తలా రెండూ చేతుల్లో పెట్టాడు.

కథా నిలయం
6097
శ్రీకాకుళం

వాళ్ళు ఎగురుకుంటూ వెళ్ళిపోయారు. ఆత్మీయంగా, ఆప్యాయంగా ఆ పిల్లల వంకే చూస్తూ అయిదు నిముషాలు లారీ డోరు మీద తల పెట్టుకొని అలాగే ఉండిపోయాడు తంగవేలు.

పైన పడమటి వైపు మబ్బులు తూర్పుకు పరుగెడుతున్నాయి. వాన రాకపోయినా కృష్ణ మీదుగా చల్లని గాలి రంయ్‌న వీస్తునే వున్నది.

ఆ డొక్కులారీ మరోసారి గర్జించింది. సాంబిగాడు సర్దుకు కూర్చున్నాడు.

"రైట్!"

సందులు గొందులు తిరిగి కాళేశ్వరరావు మార్కెట్ పక్కగా దుర్గ కొండ కిందగా వున్న గోడౌన్ల దగ్గరకు వచ్చి ఆగింది. లారీ ఆపగానే సాంబిగాడు దిగివెళ్ళి వెనక టైర్ క్రింద పెద్ద బండరాయి పెట్టి, "దిగేసేయ్, గురో!" అన్నాడు.

ఇంజనాపి దిగాడు తంగవేలు.

తంగవేలు కోసమే కళ్ళల్లో వత్తులు వేసుకు చూస్తున్నట్లున్న చుక్కమ్మ అతడు లారీ దిగటం అలస్యం మొహాన ఇంత కాంతి నింపుకొని పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అన్నా!"

"యేంటే!... బాగున్నావా... చిట్టిముండ ఎలా వున్నది?"

"బాగున్నదన్నా!"

"బడికెళుతోందా?"

"వెళ్తోందిగా!"

"ఏటి విశేషాలు... ఈ మధ్య కనబడటమే లేదు!"

"ఏం లేదన్నా.... చిన్న కష్టమొచ్చింది!"

"చెప్పు!" అన్నాడు ఆదుర్దాగా ముందుకు వస్తూ. "ఏఁవైంది...వెంకటేశు ఏమైనా అంటున్నాడా... అవునూ వాడు తాగుడు తగ్గించాడా లేదా?"

"మామూలే!" అన్నది దీనంగా ముఖం పెట్టి.

"రిక్షా ఏస్తున్నాడా?"

"నా తిండికి ఇవ్వకపోయినా... వాడి తిండికీ, తాగుడికీ కావాలిగదా!"

"ఇంతకీ ఏమిటి... డబ్బేమైనా కావాలా?"

"లేదన్నా... పనికి నాలుగిళ్ళున్నయి గదా... ఆ బాధేం లేదుగాని... నువ్వొక్కసారి మా యింటికి రా అన్నా!"

"గుట్టంతా ఎక్కాలి గదే!"

"ఫరవాలేదు... పదినిముషాల్లో వచ్చేద్దువుగాని!"

"ఇంతకీ ఏమైందో చెప్పరాదూ!"

"చెబుతా గదా... రెండు నిముషాలు ఓపిక పట్టలేవా... అది రోడ్డు మీద చెప్పేది గాదు!"

"లారీ తీసుకొని గుంటూరు పోవాల!"

"పోదువుగానిలే అన్నా... ఇప్పుడు నువ్వు రాక తప్పదు అన్నా!" ఆమె బ్రతిమలాడుతుంటే కాదనలేకపోయాడు తంగవేలు.

"అరేయ్ సాంబిగా!... పది నిముషాలల్లో వస్తా... గోతాలన్నీ లారీకెక్కించేయాలి... దగ్గరుండి లెక్కేసి ఎక్కించు!"

"అలాగే గురో!"

"గురూ గురూ అంటూ లారీ క్రింద అడ్డగుడ్డేసి తొంగున్నావో చంపేస్తా!"

"అలాగే గురో!"

తంగవేలు చుక్కమ్మ వెనుకే బయల్దేరాడు. వెళుతూ వెళుతూ క్యాబిన్ తలుపు లాగి మిగిలిన చాక్లెట్లలో గుప్పెడు తీసుకొని చొక్కా జేబులో పోసుకున్నాడు.

దూరంగా దుర్గ గుడి వెనగ్గా కొండవాలులో కట్టిన గుడిశెలు రంగు పూసిన అట్టముక్కలు అంటించినట్లుగా వున్నాయి. కృష్ణగాలి కొండను కోసుకుంటూ వచ్చి చల్లగా తగులుతోంది. రథం పక్క సందులోకి తిరిగి గుడివైపుకు వెళ్ళసాగారు ఇద్దరూ.

"ఏమైంది చుక్కమ్మా?"

"ఓ ఆడకూతురు కష్టాలలో వున్నది అన్నా!"

"వుంటే?"

"నీ సాయం కావాల్సి వచ్చింది!"

"ముక్మా మొహం తెలియని ఆమెకు నేనేం సహాయం చేయగలుగుతాను!"

"అన్నా! నువ్వే అలా అంటే ఇంకా ఆమె బ్రతుకు ఏంకావాలి... చూద్దాం... ఆమె పరిస్థితిచూసి నువ్వు చేయగలిగిన సాయం చేయి!"

– ఇదెక్కడి గొడవ తనకు?...

అసలు నిన్న మొన్నటి వరకూ చుక్కమ్మ ఎవ్వరో తెలియదు తనకు. కానీ తెలిసినప్పటినుండి ఆమెకు తనే దేవుడయ్యాడు. కనబడితే కాళ్ళ మీద పడ్డంత పనిచేస్తుంది... తను చేసింది ఏమంత గొప్పసాయం గూడా కాదు... దాని మొగుడు వెంకటేశు రిక్షాలాగుతుంటాడు. వచ్చిన డబ్బులన్నీ తాగేస్తాడు. ఇంటికివచ్చి తిండి పెట్టకపోతే పెళ్ళాన్ని చితక తన్నుతుంటాడు. ఈవిడేమో నాలుగిళ్ళల్లో పాచిపనిచేసి ఇంత చద్దికూడు, నాలుగు డబ్బులు సంపాదించుకొస్తూ గుట్టుగా సంసారం ఈదుకొస్తోంది.

ఇటువంటి సమయంలో– దానికున్న ఒక్కగా నొక్క బొట్టి ముండకు న్యుమోనియా వచ్చి చచ్చేటంత పనయింది. కూతురుకు అట్లావున్నా నయాపైసా ఇవ్వకపోంగా పెళ్ళాన్ని తన్నటం మానుకోలేదు వెంకటేశు!

ఒక రోజున తను– ఇలాగే గుంటూరునుంచి విజయవాడకు లోడేసుకు వచ్చి– తెలిసినవాడి కోసం అటు పక్కకు వచ్చిన తనకు చచ్చేటందుకు సిద్ధంగా వున్న పిల్లముండను ఒళ్ళో వేసుకొని ఏడుస్తూ కూర్చున్న చుక్కమ్మ కనబడింది. ఆమె పరిస్థితి చూచి జాలిపడి– ఆ పిల్లముండను ఆసుపత్రిలో జేర్చి ఓ వంద రూపాయలు ఖర్చుపెట్టి బతికించాడు.

అదే వాళ్ళిద్దరి మధ్యా వున్న బాంధవ్యం!

ఎత్తెక్కుతున్నారు ఇద్దరు.

"ఎవ్వరా మనిషి?"

"తెలియదన్నా!"

"నీకెట్లా తగిలింది?"

"మా ఇళ్ళముందు నీరసంగా పడి వుంటే తెచ్చి నా గుడిశెలో పడేశా... చచ్చేటట్లున్నది... అసలే బక్కముండ!"

"దారిన పోయే వాళ్ళందరినీ నెత్తినేసుకొని నువ్వేం ఈదుకొస్తావే– నీ సంసారమే నీకు చట్టుబండల్లా వుంటే!"

"ఏం చేయమంటావన్నా! తోటిమనిషి... ఆడది... కష్టాలల్లో వున్నది... కష్టాలంటే ఏమిటో నాకు తెలుసు... మూతి విరిచేవాళ్ళు, ముక్కు విరిచేవాళ్ళే తప్ప ఇన్ని గంజినీళ్ళు పోసేవాళ్ళు కనబడలేదు... రోడ్డుకడ్డంగా పడిచస్తుంటే చూస్తూ ఎలా వూరుకోమంటావ్!" అన్నది బాధగా– ఆమె జాలిగుండె విరిగి ముక్కలవుతుండగా.

తంగవేలు మాట్లాడలేకపోయాడు. అందుకే అతడికి చుక్కమ్మంటే సానుభూతి వున్నది. జాలి వున్నది. మనిషిని మనిషిగా చూడాలనుకునే ఆమె ఆలోచనలు అతడికి నచ్చుతాయి.

గుట్టెక్కిన వాళ్ళకు విజయవాడ పట్టణమంతా రంగురంగుల బొమ్మల కొలువులా కనబడ్తోంది.

గుడిశె తడిక లోపలకు నెట్టి, "రా అన్నా!" అన్నది.

"ఇంద... ఈ చాక్లెట్లు మీ బొట్టిముండకివ్వు!"

"ఎక్కడ చచ్చిందో ఏమో... ఒక్క క్షణం ఇంట్లో పడిచావదు గదా!" ఇంట్లో వుండని కూతురు మీద విసుక్కున్నది.

"తిట్టబోకు... పిల్లముండకు ఏం తెలుసు...తింటారు తిరుగుతారు... ఆడుకుంటారు... ఆ వయస్సు అలాంటిది... వాళ్ళ ఆటపాటలు చూచి మనం ఆనందించాల్సిందేగాని ఏమీ అనగూడదు!"

"దాని సంతగోల సరేగాని... కూర్చో!" అన్నది చిరిగిన పట్టాముక్కను తడిక పక్కగా వేస్తూ.

తంగవేలు తడికానుకు కూర్చున్నాడు.

"ఈవిడే అన్నా!... నా అన్నవాళ్ళెవ్వరూ లేరట... కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది! ఆ ఏడుపుతో ఎప్పుడో చచ్చేది ఇప్పుడే చచ్చేటట్లున్నది!"

తలెత్తి చూచాడు తంగవేలు. చుక్కమ్మ చెప్పినట్లు బక్కగావున్నది. అసలే దిగుళ్ళలో వున్నదేమో చచ్చేటందుకు సిద్ధంగా వున్నట్లున్నది– చాలాసేపు ఆమెనే కన్నార్పకుండా చూస్తూ వుండిపోయాడు తంగవేలు...

కళ్ళల్లో ప్రాణాలతో రెపరెపలాడుతున్న ఆ ఆకారాన్ని చూస్తుంటే తంగవేలు కళ్ళల్లో నీరు చిప్పిల్లింది.

"నీకేక్షేమందే?" అన్నాడు తలవంచుకొని బాధగా.

ఆ స్త్రీ ఒక్కసారిగా ఘొల్లు మన్నది- ఎవ్వరో చచ్చినట్లుగా. గజ్జికుక్కను కర్ర తీసుకు కొడితే ప్రాణం పోతున్నట్లుగా గిలగిలలాడుతూ ఓపికలేక మూలిగినట్లుగా ఏడ్చింది. ఆపుకొని ఆపుకొని ఒక్కసారి 'భొళుక్కు' మన్నట్లుగా ఏడ్చింది.

"ఎందుకా ఏడుపు... ఏమైందో చెప్పరాదు!"

చుక్కమ్మే అన్నది. "తోటి ఆడముండను నాకే చెప్పి ఏడ్వటంలేదు... ముక్కూ మొహం తెలియని పరాయి మగవాడివి నీకేం చెప్పి ఏడుస్తుంది- ఎవరో ఆమెను మోసం చేసినట్లున్నారు... ఒకడు మోసం చేస్తేనే కష్టాల్లో దూకేయాలనిపిస్తుంది... మీ మగవాళ్ళంతా కలసి నాశనంచేస్తే కృష్ణలో దూకాలన్నా ఓపిక ఎక్కడనుండి ఏడుస్తుంది!" అన్నది అసహ్యంగా ముఖం పెట్టి.

గుడ్లగూబలు ఒక్కసారిగా చెట్లమీదనుంచి ఎగరబోతూ రెక్కలు టపటపలాడించినట్లుగా గుండెల మీద టకటకా కొట్టుకుంటూ, "నేను బ్రతకను... నేను బ్రతకను... నన్ను చావనీయండి!" అన్నది నేల మీద అటూ యిటూ పొర్లుతూ.

చుక్కమ్మ వెళ్ళి ఆవేశంతో ఏడుస్తున్న ఆమెను పట్టుకు కూర్చున్నది. "ఛ! ఏడ్వబోకు... అంతా రాక్షసులేనేంటి ఈ ప్రపంచంలో... తంగవేలు అన్నలాంటి దేవుళ్ళూ వుంటారు... నీకు దారి చూపిస్తాడులే... ఏడ్వబోకు!" అన్నది ఆమెను ఓదారుస్తున్నట్లుగా తన చీర చెంగుతో కన్నీళ్ళు తుడుస్తూ.

"నన్నేం చేయమంటావు చెప్పు!" అన్నాడు లేచి నిల్చుంటూ.

"అన్నా! నేను చెప్పేదాన్నా... నువ్వే ఓ దారి చూడాలి!"

"సరే!" ఓ క్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు. "చూద్దాంలే కానీయ్!"

"అలా అంటే కాదు... నువ్వు తాత్సారం చేస్తే ఈవిడ బతికేలా లేదు... ఎవ్వరికి చెప్పుకుంటుంది తన కష్టం... అంతా రాబందులే!" అన్నది దిగులుగా.

తంగవేలుకు చికాకు వేసింది చుక్కమ్మను చూస్తుంటే.

అడుగులు బయటకు వేయటానికి అన్నట్లుగా తలుపు వైపుకు తిరిగాడు.

"అన్నా!" అన్నది చుక్కమ్మ దీనంగా.

ఆ స్త్రీ రోదన ఆ ఇద్దరి గుండెల్ని కుళ్ళబొడుస్తోంది.

ఇంటి పక్కన పిల్లలెవ్వరో టైరు ముక్క కాలుస్తున్నారల్లే వున్నది శవం కాలిన కంపు కొడుతోంది.

"ఏం చేద్దాం అన్నా!" కళ్ళొత్తి తంగవేలునే కన్నార్పకుండా చూస్తూ అన్నది.

చుక్కమ్మ చూపుల్ని, ఆ స్త్రీ ఏడుపుని, పక్కనే కాలుతున్న టైరు కంపునీ భరించలేనట్లుగా ఓ మూలుగు మూలిగాడు. "ఓ పని చేయమను... ఆమెకిష్టమయితే నాతో రమ్మనమను... మా ఇంట్లోనే ఇంత కూడు ఉడకేస్తూ తనింత తింటూ పడి వుండమను!" అంటూ బయిటకు వచ్చేశాడు- తను అంతకుమించి ఆమె విషయంలో చేయగలిగిందేం లేదు అన్నట్లుగా.

"చాలన్నా!" అన్నది ఆనందంగా చుక్కమ్మ.

ఆ స్త్రీ ఏడుపు మరోమారు ఆ కొండలమీద పాకల మధ్య ఘొల్లుమన్నది. చావబోయే వాడు రక్తం కక్కుకున్నట్లుగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నది.

"నీవు దేవుడివి అన్నా!"

"వెళ్తా... ఎల్లుండి లోడేసుకొస్తా... వచ్చినప్పుడు ఇక్కడకు వస్తా... ఈలోగా ఆలోచించుకోమను!"

"అలాగే అన్నా!"

చటుక్కున మెట్లు దిగేశాడు. ఇక అక్కడ వుండి ఆమె దుఃఖాన్ని చూడలేనట్లుగా, ఏడుపును భరించలేనట్లుగా.

బిగుసుకుపోయి వడివడిగా కొండ దిగసాగాడు.

కొండ చాటుకు పోతున్న సూర్యుడు ఆ ఇళ్ళ మీద నీడల పట్టాల్ని పరిచేస్తున్నాడు. ఆకాశంపై మబ్బులు చిందర వందర అయినాయి.

చేతి గడియారం చూచుకున్నాడు. నాలుగు గంటల ముప్పయి నిముషాలయింది. సాంబిగాడు గోనె సంచుల్ని పూర్తిగా లారీలో పడేయించాడో లేదో... అయిదింటికి బయిల్దేరినా గుంటూరు వెళ్ళేటప్పటికి ఆరవుతుంది.

తలంతా నాజుగా వున్నది. ఒళ్ళంతా పులిసినట్లుగా వున్నది. వేణ్ణీళ్ళెట్టుకొని స్నానం చేసి తొంగోవాలి- అన్నంత హడావుడిగా ఎత్తుమీద ఉన్న ఇళ్ళను దాటుకుంటూ లోయలోకి దిగేస్తున్నట్లుగా కిందకు వచ్చాడు. దుర్గగుడి దాటాడు. కొబ్బరికాయల కొట్లు దాటాడు. రథం దగ్గరకు వచ్చి మలుపు తిరిగి కాలవ పక్కగా గోడవున్న దగ్గరకు వచ్చాడు.

సాంబిగాడు తన డొక్కు పచ్చలారీ వెనకాల నిల్చొని తంగవేలు కోసమే ఎదురు చూస్తున్నాడు- గోతాలన్నీ లారీకి ఎక్కించి.

తంగవేలును చూస్తూనే, "పాతికివ్వు!" అన్నాడు.

"అన్నీ ఎక్కినయ్యా!"

"ఆఁ... కూలీలు డబ్బులిస్తే వెళ్ళిపోతారు!"

పాతికిచ్చాడు. చుక్కమ్మ తెచ్చిన తలనొప్పితో లారీ ఎక్కాడు. ఇంజను స్టార్టు చేశాడు. లారీ అంతా ఊగిపోతూ దడదడలాడింది. సాంబిగాడు వెనుక టైరుకు పెట్టిన బండరాయిని తీసి మురుగు కాలవ పక్కగా పడేస్తూ, "రైట్!" అన్నాడు.

గేరు మార్చి బ్రేకు వదిలాడు తంగవేలు- డోరు తీసుకొని మెడ వెనక్కు పెట్టి చూస్తూ.

"రైట్!"

పల్లంలోకి జారుతోంది లారీ.

"రైట్!"

మెయిన్ రోడ్డు ఎక్కింది. అప్పటికి అనుకున్నట్లుగానే అయిదు గంటలయింది. గుంటూరు వెళ్ళేటప్పటికి ఆరు గంటలవుతుంది.

తంగవేలుకు నీరసంగా వున్నట్లనిపించింది. చికాగ్గా వున్నది. ఆ గంటా లారీని అన్యమనస్కంగానే నడిపాడు. ఆ స్త్రీ ఏడుపు చెవుల్లో గింగిరుమంటోంది. కొబ్బరి పీచులా ఎండిపోయి రాగిరంగులో చిందరవందరగా పడుతున్న జుట్టు వెనగ్గా పీక్కుపోయి జీవం లేకుండా వున్న ఆమె ముఖం కళ్ళముందు అద్దంలోలా కనబడుతున్నది.

లారీని సేటు ఇంటిముందు ఆవరణలో ఓ పక్కగా నిలబెట్టి సేటుకు చెప్పాడు. "కూలీలంతా వెళ్ళిపోయివుంటారు... గోతాలు పొద్దున్నే దింపిస్తాను సారూ!" అని.

"అలాగే లేరా!"

"వెళ్ళి వస్తాను సార్!" తలవంచుకొని వెనక్కు తిరిగాడు.

"ఏరా తంగవేలూ! ఏమన్నా తెలిసిందా?"

తంగవేలుకు ఆయన అడిగింది అర్థమయిందిగాని, ఎలా సమాధానం చెప్పాలో తెలియలేదు. అందుకే మాట్లాడకుండా బయిటకు వచ్చేశాడు. సాంబిగాడు వెనకే బయల్దేరాడు.

"ఒరేయ్ సాంబిగా! పదరా... ఇవాళ ఓ చుక్కేసుకోవాలి!" అన్నాడు- తలలో తిరుగుతున్న బొమ్మల్ని చెరిపేసుకొని హాయిగా వుండాలి అన్నట్లుగా. నెత్తిన ఎవడో చితకబాదుతున్నట్లుగా సాంబిగాడు గిర్రున తిరిగాడు. ఓ పక్క మరోచుక్క పడబోతున్నందుకు ఆనందం. మరోపక్క తన గురువుగ్గూడా పుచ్చుకుంటానంటున్నందుకు ఆశ్చర్యం!

కళ్ళు ఇంతవి చేసుకొని, "అదేటి గురూ!" అన్నాడు.

"చుక్కమ్మ నా బుర్ర పాడుచేసిందిరా!"

"ఏమైంది గురో!"

"ముందు మందేసుకోవాల్సిందే... పద పద!" అంటూ పెద్ద పెద్ద అంగలతో అక్కడకి అర ఫర్లాంగు దూరంలోని కోనేటి పక్కగా వున్న కాంపౌండులోకి దారితీశాడు.

సాంబిగాడికి ఏమీ అర్థం కాలేదు. గురువుకు చాలా రోజుల తరువాత ఓ మంచి బుద్ధి పుట్టిందే అన్న సంతోషం- మనస్సులో ఓ మూల మెరుపులా మెరుస్తున్నా! 'ఏదో జరిగింది... ఏదో జరిగింది... ఇంకేదో జరగబోతోంది!' అన్న భయం గూడా అతడిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

కాంపౌండ్‌లో ఓ మూలగా వెళ్ళి కూర్చున్నాడు. సాంబిగాడికి డబ్బులిచ్చి సీసాలు తెప్పించాడు. ఉల్లిపాయ పకోడీలు తెప్పించాడు. మురుకులు తెప్పించాడు. నాలుగు పచ్చిమిరపకాయ బజ్జీలు తెప్పించాడు.

కందిరీగల్లా ఆలోచనలు బుర్రంతా పాడుచేస్తుంటే సాంబిగాడు యాంత్రికంగా గురువు చెప్పినవన్నీ చేస్తున్నాడు.

చెరో సీసా పూర్తి చేశారు.

సాంబిగాడు అంతకు ముందే ఒకసారి బెజవాడలో పట్టించి వుండటంతో తొందరగానే అదుపు తప్పాడు.

"ఏమైందిరా గురువా!" అన్నాడు ముద్దముద్దగా.

తంగవేలు దిట్టంగా వుంటాడు. తరచూ త్రాగే అలవాటు లేకపోయినా ఓ సీసా అంటే అతగాడికి ఓ చెంచాతో సమానం.

"పిల్లలు లేరనే విచారం నాకు లేదురా... అందుకు నేనెప్పుడూ బాధ పడలేదు గూడా... ఈ ప్రపంచంలో రోడ్ల మీద తిరిగే పిల్లలంతా నా వాళ్ళేరా... దానికీ అంత బాధ వున్నట్లు నాకెప్పుడూ అనిపించలేదు.... నా వల్ల పిల్లలు లేని దానికి తల్లి అవ్వాలనే కోరిక అంతగా వుందని నాకు తెలియదురా పిచ్చి సన్నాసీ!... ఎవుడు చెప్పిన మాటలో దాని మనస్సును పూర్తిగా పాడుచేసినయిరా... తల్లినవుతాను తల్లినవుతాను- అంటూ కలలుకంటూ నా పంచలో నుంచి పారిపోయిందిరా నన్ను వదిలేసి... పోనీయ్‌లే దాని ఆనందాన్ని, దాని కోరికల్ని నేను ఎందుకు నాశనం చేయాలీ అని నా మనస్సుకు నేనే ఇన్నాళ్ళూ సర్ది చెప్పుకుంటున్నాను..."

సాంబిగాడికి ఎక్కు వచ్చింది.

'పాపం ఆ పిచ్చిదాని కోరికలు తీరకపోగా- బ్రతుకు కుక్కలు చింపిన విస్తరి అయి దిక్కులేని దానిలా చుక్కమ్మ ఇంట్లో కుళ్ళి కుళ్ళి చస్తున్నదిరా!' అని సాంబిగాడికి చెప్పటం ఇష్టం లేదన్నట్లుగా గుప్పెడు పకోడీలు తీసుకొని నోట్లో కుక్కుకున్నాడు ఆవేశంగా తంగవేలు.

* * *

*(ఈనాడు ఆదివారం: 11. 12. 1988)*